గిరిజనుల అభివృద్ధికి కృషి

- నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్న చెంచులు
- చెంచు కాలనీలలో పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రాలు
- అభివృద్ధిలో ముందుంటామని ఎమ్మెల్యే కాటసాని హామీ



పాణ్యం చెంచు కాలనీలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: చెంచుల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు, వారిని చెడు వ్యసనాల నుంచి మళ్లించి ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేసి సమాజంలో ఒకరిగా జీవించే అవకాశం కల్పించడం.. ఆనాడు తీసుకున్న ప్రణాళికలతోనే సాధ్యమైందన్నారు. మంగళవారం పాణ్యంలోని సచివాలయం-4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ముప్పై ఏళ్ల కిందట చుట్టు పక్కల గ్రామాల్లోని కొండ ప్రాంతాల నుంచి చెంచులను రప్పించి పాణ్యంలోని ఇందిరా నగర్ (చెంచు కాలనీ) ఏర్పాటు చేసి వారి జీవనాధారాలను మార్చామన్నారు. చెంచులకు రాయితీపై బర్రెలు, కోళ్ల ఫారాలు, సొంతిల్లు కల్పించడం, సాగు చేసుకునేందుకు పొలం, కొండల్లో లభించే ఫలాలను విక్రయించుకునేందుకు, అడవుల్లో దొరికే ఫలాలను తెచ్చుకునేందుకు అనుమతి కోసం గిరి కార్డులు ఇచ్చామన్నారు. అలాగే కాలనీని ఐటీడీఏ పరిధిలోకి తెచ్చి పాఠశాలలను ఏర్పాటు చేసి పిల్లలకు విద్య అందించామన్నారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కాలనీలో చక్కటి రోడ్లు, సురక్షిత మంచినీరు, ఉపకేంద్రాలు ఏర్పాటు చేసి విద్య, వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. దీంతో చెంచుల జీవనాధారం మరింత మెరుగుపడిందన్నారు.

కాలనీలో రైతులే అధికం

కాలనీ ఏర్పడిన తర్వాత చెంచులు సాగు చేసుకునేందుకు భూములు ఇవ్వడంతో వారు నేడు రైతులుగా మారి కర్నూలు సోనా బియ్యం పండిస్తున్నట్లు తెలిపారు. సాధారణ రైతులతో పోటీ పడి ఎకరానికి 40 బస్తాలకు పైగా దిగుబడి తీస్తున్నారని చెప్పారు.

బాల్య వివాహాలు చేయొద్దు

చెంచులు ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, ప్రభుత్వమే అన్ని రకాల సౌకర్యాలు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపాలన్నారు. చిన్న వయస్సుల్లోనే వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. చెడు వృత్తుల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఇటీవల రాయితీపై ఆయిల్ ఇంజిన్లు, ఇళ్ల పట్టాలు, కొత్త గృహాలు మంజూరు చేశామన్నారు. అలాగే ప్రజలకు సురక్షిత మంచినీటి కోసం తాగునీటి ప్లాంట్, ఆరోగ్య ఉప కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రతి గడప వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బద్రీనాథ్‌రావు, జాకీర్ ఉసేన్, సుబ్బరాయుడు, ఎల్లగౌడ్, చికెన్ వలి, నూర్, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ, రాజన్న, స్వామి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముప్పై ఏళ్ల నాటి పరిస్థితులు, ఇప్పుడున్న పరిస్థితులు పూర్తి భిన్నంగా మారాయన్నారు. చెంచుల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తానన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. మండలంలోని లద్దగిరి గ్రామ సచివాలయం-1 పరిధిలో జనరల్ మహిళ, లద్దగిరి గ్రామ సచివాలయం-2లో జనరల్, ఎర్రదొడ్డి గ్రామ సచివాలయంలో ఎస్సీ మహిళకు పోస్టులు రిజర్వేషన్ అయినట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 25న దరఖాస్తుల పరిశీలన, 26న ఇంటర్వ్యూలు, 28న అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో రెండు, సంగాల గ్రామ సచివాలయ పరిధిలో రెండు, కొండాపురంలో ఒకటి చొప్పున మొత్తం ఐదు వలంటీర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయని ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. కొండాపురంలోని క్లస్టర్ – 11లో బీసీ మహిళ, పోలకల్ – 2 సచివాలయంలోని క్లస్టర్ – 15లో ఎస్సీ మహిళ, పోలకల్ – 3 సచివాలయంలోని క్లస్టర్ – 16లో ఎస్సీ జనరల్, సంగాల సచివాలయంలోని క్లస్టర్ – 6, 20లలో బీసీ మహిళలకు పోస్టులు రిజర్వేషన్ అయినట్లు ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రీసర్వే పక్కాగా చేపట్టండి



పెంచికలపాడులో భూముల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

గూడూరు రూరల్: మండలవ్యాప్తంగా చేపట్టిన భూసర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. పెంచికలపాడులో జరుగుతున్న రీ సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు తమ భూమి హక్కులకు సంబంధించిన డాక్యుమెంట్లను చూపి రీసర్వేకు సహకరించాలన్నారు. సర్వే పూర్తయిన తరువాత రైతులకు భూమిపై శాశ్వతంగా హక్కులు ఉండేలా ధ్రువపత్రాలను అందిస్తామని ఆయన తెలిపారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన, పట్టువస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని పెళ్లి పత్రికను అమ్మవారి పాదాల వద్ద ఉంచి శుభకార్యాలు బంధుమిత్రులతో కలిసి సుఖసంతోషాలతో జరుపుకునేలా దీవించాలని మొక్కుకున్నారు. మరికొందరు ఉద్యోగ ప్రాప్తి, సంతాన ప్రాప్తి ప్రసాదించాలని, నూతన వధూవరులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సారా విక్రేత అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే దిశగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. హుసేనాపురం గ్రామానికి చెందిన తలారి దస్తగిరి అనే వ్యక్తి గ్రామంలో చాలారోజుల నుంచి నాటు సారా అమ్ముతున్నట్లు తెలిసింది. ఆ మేరకు దస్తగిరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అతని వద్ద ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు. మండలంలో ఎవరైన ఎక్కడైనా పేకాట, మట్కా, నాటుసారా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్‌ఐ హెచ్చరించారు.

76 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఐ నల్లప్ప

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 76 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీ చేపట్టగా ఎరుకల నరసింహులు ఇంటి ముందు ఎలాంటి అనుమతులు లేని 76 క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. పోలీసులను చూసి నిందితుడు పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అంతరాయం వస్తే వెంటనే స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింద స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక, ఇతర కారణాలతో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, ఇలాంటి సమస్యలు దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చూపాలన్నారు. దీనిపై పదేపదే చెప్పించుకోరాదని, ఉద్యోగులు, సిబ్బంది పనిచేసే చోట ఉంటేనే సమస్యలు తెలుస్తాయన్నారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెరువు కట్టను పునరుద్ధరించాలి



పెంచికలపాడు చెరువులో దీక్ష కొనసాగిస్తున్న నాయకులు

గూడూరు రూరల్: కూల్చివేతకు గురైన చెరువు కట్టను పునరుద్ధరించి గ్రీన్‌కో నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. పెంచికలపాడు చెరువులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం కొనసాగింది. ఈ దీక్షకు మద్దతు తెలిపేందుకు హాజరైన గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువును కొందరు వ్యక్తులు పవన విద్యుత్ ఏర్పాటుకు గ్రీన్‌కో సంస్థకు లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. ఇరిగేషన్ ఆధీనంలో ఉన్న చెరువు భూములను ప్రైవేట్ సంస్థకు ఎలా ఇచ్చారని, ఇందులో అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. రెండు గ్రామాలకు తాగునీరు, ఆయకట్టుకు సాగునీరు అందించే చెరువు అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణ, డివిజన్ కార్యదర్శి మోహన్, సర్పంచ్ నయోమి తదితరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్

గ్రామస్తులు, సీపీఎం నాయకులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సందర్శించారు. వారు అడిగిన వాటికి సమాధానం ఇస్తూ చెరువు భూమి ఇరిగేషన్ పరిధిలో ఉందని, ఇప్పటికే అధికారులతో మాట్లాడామని, చెరువు కట్ట పునరుద్ధణతో పాటు తూములను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కట్టను ధ్వంసం చేసిన వారిపై పోలీసు కేసును నమోదు చేస్తామని హామీఇచ్చారు.

పంచాయతీ నిర్వహణపై శ్రద్ధ చూపండి

సి.బెళగల్: మండలంలోని గ్రామ పంచాయతీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు శ్రద్ధ వహించాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు.ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్‌తో కలిసి పంచాయతీ పాలన, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధులతో ప్రాధాన్యతా ప్రకారం అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని, ఇందుకు అవసరమైన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గ్రామాలలో మురుగు కాలువలలో పూడిక తీత, చెత్త తొలగింపు పనులు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కూలీల వేతనాల చెల్లింపులు, ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు ఎంబుక్‌లో నమోదు చేసి ఆడిట్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.

లింగ వివక్ష రూపుమాపాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఐసీడీఎస్, పోలీసు అధికారులు

పాణ్యం: సమాజంలో లింగ వివక్ష చూపరాదని, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చంద్రకళ, ఏసీడీపీఓ పద్మావతి, ఏఎస్‌ఐ నరసింహులు మాట్లాడుతూ.. సమాజంలో లింగ వివక్ష చూపడం నేరమన్నారు. అందరూ ఒక్కటేనన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే తక్షణమే సమాచరం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. అలాగే ఆడపిల్లను రక్షించండి- ఆడపిల్లను చదివించాలనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తుంటే టోల్ ఫ్రీ నంబర్ 181, 100 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాల నివారణ పోస్టర్లను అతికించాలన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించి వారికి విద్య అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపవర్‌వైజర్ నాగసుంకన్న, ఎంపీడీఓ దస్తగిరి, వీఆర్‌ఓలు, ఏఎన్‌ఎం, ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ వర్కర్లు, పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

గూడూరు: పొదుపు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వైకేపీ ఏపీఎం సుధాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైకేపీ సమావేశ హాలులో గ్రామైఖ్య సంఘం మహిళలకు మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, వాయిదాలు ఎలా చెల్లించాలి, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, తదితర విషయాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకున్న మహిళలు వారి గ్రామాలలోని పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని ఏపీఎం సూచించారు. స్త్రీనిధి, తదిర రుణాలు, ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులపై అవగాహన కల్పించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సులోచనమ్మ, సీసీ, వీఓఏలు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులను పర్యవేక్షించండి

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు–నేడు రెండవ విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలపై గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెండవ విడత నాడు–నేడులో భాగంగా జరుగుతున్న పనులను నెలాఖరులోగా పూర్తి చేయించాలన్నారు. హెచ్‌ఎంలు, పీఎంసీ సభ్యులతో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రెగ్యులర్‌గా సమీక్షించుకోవాలని, అలాగే పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ కోతలు

కోడుమూరు రూరల్: గూడూరు సబ్‌డివిజన్ పరిధిలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ జేషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న సామూహిక వరలక్ష్మీ వ్రతం

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరశ్వరీ దేవి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 25న శుక్రవారం సామూహిక శ్రావణ శ్రీ వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ తెలిపారు. మహిళా భక్తులు ఈ నెల 25న ఉదయం 9 గంటలకు దేవాలయానికి చేరుకోవాలన్నారు. వ్రతానికి సంబంధించి ఎలాంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదని, పూజకు అవసరమైన సామగ్రిని దేవస్థానం వారు ఉచితంగా అందిస్తారన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో సీసీ రోడ్డుపై నెర్రలు

కల్లూరు: చిన్నటేకూరు నుంచి వయా బస్తిపాడు మీదుగా కె.నాగలాపురం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. తుంగభద్ర నది పరిసర ప్రాంతంలో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఇసుక లారీలు పరిమితికి మించి అధిక లోడ్‌తో ప్రయాణిస్తుంటాయని ఆయా గ్రామస్తులు పేర్కొన్నారు. అధిక లోడ్‌తో వచ్చే భారీ వాహనాల వల్ల చిన్నటేకూరు గ్రామంలో సీసీ రోడ్డు నెర్రలు ఇచ్చిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు ఎదురుగా వచ్చే భారీ వాహనాలను చూసి భయం భయంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. వాహనాదారులు రాత్రి సమయంలో మరింత ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: బడి ఈడు పిల్లలను బడికి పంపకుండా పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం అని జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలు ఫ్యాక్టరీలు, ఇటుకల బట్టీలు, స్టోన్ క్రషింగ్ పరిశ్రమలలో ప్రత్యేక అధికారుల బృందం తనిఖీలు చేపట్టి బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో సాంబశివరావు మాట్లాడుతూ.. తల్లితండ్రులు, కార్మికులు, పరిశ్రమల యజమానులు పిల్లలకు బంగారు భవిష్యత్ అందించాలని సూచించారు. బడి ఈడు పిల్లలను బడికి పంపకుండా పనులకు పంపితే ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులను తొలగించే అవకాశం ఉందన్నారు. షాపులు, పరిశ్రమల వద్ద యజమానులు కచ్చితంగా పిల్లలను పనిలో చేర్చుకోబోమని స్టిక్కర్లు అతికించాలని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని కోరారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు మధుసూధాకర్, జిల్లా పరిశ్రమల అసిస్టెంట్ తనిఖీ అధికారి బీవీ రాజేష్‌రెడ్డి, లేబర్ అధికారులు కేశన్న, శ్రీలక్ష్మి, హేమాద్రి, రాంప్రసాద్, జాతీయ బాలకార్మిక నిర్మూలన సంస్థ అధికారి రంగారెడ్డి, చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ సుంకన్న, నరసింహరాజు, బీబీఏ సంస్థ జిల్లా ప్రతినిధి వెంకట తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం

గడివేముల/పాణ్యం: పాణ్యంలోని సచివాలయం -4పరిధిలో, గడివేముల మండల కేంద్రంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి మంగళవారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై గ్రామంలోని ప్రతిఇంటికీ తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకోనున్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదే విధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గడివేములకు చెందిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేయనున్నట్లు చెప్పారు.

పింఛన్ అర్జీల పరిశీలన



దరఖాస్తుదారుల వివరాలపై వాకబు చేస్తున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వివరాలను ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 253 అర్జీలు విచారణకు రావడం జరిగిందని, అర్జీలన్నింటినీ పరిశీలించి అర్జీదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఈనెల 24వ తేదీలోగా మండలంలో పింఛన్ అర్జీదారుల వెరిఫికేషన్‌ను పూర్తి చేయడం జరుగుతుందని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. అలాగే ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు మండలంలో ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఈఓఆర్డీ మంజుల ఉన్నారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు పి.బషీర్ ఖాన్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, ఎరుకల రాజు, రమేష్‌బాబు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, అనిల్‌బాషా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విచారణ జరిపారు. ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విచారణలో బయటపడిందని కమిటీ సభ్యులు వెల్లడించారు. గత వారం ఉపాధ్యాయుడిపై అసభ్య ప్రవర్తనపై తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగిన విషయం తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

తగిన చర్యలు తీసుకుంటాం

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన గురించి నా దృష్టికి వచ్చింది. నోటీసులు జారీ చేయాలని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరికి ఆదేశాలు జారీ చేశాం. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటాం.

– హనుమంతరావు, డిప్యూటీ డీఈఓ.

జల సవ్వడితో మురిసిన రైతన్న



బూజునూరు సమీపంలో వరి నాటేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం,



కరిమద్దెల సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు



ఎస్‌ఆర్‌బీసీ కాలువలో ప్రవహిస్తున్న నీరు



పెసరవాయి వద్ద కేసీ కెనాల్‌లో పారుతున్న నీరు

వర్షం కోసం ఎదురుచూస్తున్న మెట్ట ప్రాంత రైతులకు సోమవారం మండల పరిధిలోని ఎస్‌ఆర్‌బీసీ కాలువకు, కేసీ కెనాల్‌కు నీరు రావడంతో ఊరట కలిగింది. గత కొన్ని రోజులుగా వర్షం లేక ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లు వాడుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కేసీ, ఎస్‌ఆర్‌బీసీకి నీరు రావడంతో మొక్కజొన్న, మిరప, పత్తి, సోయాబీన్ పంటలకు మోటర్ల ద్వారా నీటిని పెట్టుకుంటున్నారు. అలాగే ఆయకట్టు రైతులు వరి సాగు చేసేందుకు పొలాలను దమ్ము చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాగు నీరు విడుదల చేయడంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – గడివేముల

అర్హులందరికీ పథకాలు అందించండి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కర్నూలు (న్యూటౌన్): అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం జెడ్పీ కార్యాలయంలో కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్‌తో కలిసి వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. జగనన్న అమ్మ ఒడి, నేతన్న నేస్తం, వాహనమిత్ర, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే తప్పులు లేకుండా చేపట్టి 5 నుంచి 18 సంవత్సరాల పిల్లలను బడిలో చేర్పించాలని చెప్పారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు స్కూల్, హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి కన్సిస్టెంట్ రితం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే జగనన్న అమ్మ ఒడి ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం వచ్చిన అర్జీలను విచారించాలని, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప

గడివేముల: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 ప్రకారం మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వివాహ నమోదు చట్టం కచ్చితంగా అమలు చేయాలని వయస్సు ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. అమ్మాయికి- 18, పురుషుడికి- 21 ఏళ్లు పూర్తయ్యే వరకు వివాహం చేయరాదని అలా చేస్తే తగిన శిక్ష పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యుక్త వయస్సులో జరిగే వివాహాలు ఆనందకరం, ఆరోగ్యకమన్నారు. ఆయా గ్రామాల్లోని మహిళా పోలీసులు పాల్గొన్నారు.